సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
13-09-2025
పేజీలు: 02



# డయేరియాపై చర్యలు ఎక్కడ?

విజయవాడలో రోజురోజుకి పెరిగిపోతున్న డయేరియా వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి అని ప్రభుత్వాన్ని అడిగితే, బుడమేరుపై సాకు చెపుతున్నారు. అసలు బుడమేరుకు, డయేరియాకు సంబంధమేంటి? అంటూ వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మెడికల్ క్యాంప్‌లో కాలం చెల్లిన మందులు ఎలా ఇచ్చారు? రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అంటూ ఆయన మండిపడ్డారు. ''మంత్రులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. వినాయక చవితి భోజనాలు తిని డయేరియా వచ్చిందని ఒకరంటారు. బుడమేరు కారణంగా భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఒకరంటారు. విజయవాడ నగరం ఎప్పుడు ఏర్పడింది?. ఇక్కడ పైప్ లైన్ వ్యవస్థ ఎప్పుడు ఏర్పడింది?. మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడి చేతులు దులిపేసుకోవడం బాధాకరం'' అని అప్పలరాజు పేర్కొన్నారు. ''గత ఐదేళ్లలో ఇలాంటి సంఘటనలు ఒక్కటైనా చూశామా?. వైయస్ జగన్ సమయానికి అన్ని శాఖలతో సమీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకునేవారు. వర్షాకాలం ప్రారంభం ముందు చంద్రబాబు ఏనాడైనా రివ్యూ చేశాడా?. గతేడాది బుడమేరుకు వరదొస్తే చంద్రబాబు ఏం చేశారు?. వరదలు వస్తాయని వాతావరణశాఖ చెబుతుంటే చంద్రబాబు పెన్షన్ల పంపిణీకి వెళ్లాడు. పెన్షన్ పంపిణీ అంతా ఒక సినిమా షూటింగ్. ఇదే నియోజకవర్గంలో వైఎస్ జగన్ నాలుగు యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటో వెళ్లి చూడండి. చంద్రబాబు ప్రెస్ మీట్లు పెట్టి జనానికి అర్థం కాని భాష మాట్లాడుతుంటారు'' అంటూ అప్పలరాజు ఎద్దేవా చేశారు.



## హెచ్ పి పెట్రోల్ బంకులో మోసాలు....
## లీటర్ పెట్రోల్ లో అర లీటర్ నీళ్లు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేర్రిగూడ హెచ్ పి పెట్రోల్ బంక్‌లో నీళ్లు కలిసిన పెట్రోల్ కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి మహేష్ అనే వ్యక్తి పెట్రోల్ కొట్టించుకోగా ఈ రోజు తన కారు ఆగిపోయింది. బంక్ వద్దకు వచ్చి వాటర్ బాటిల్‌లో పెట్రోల్ కొట్టించగా, అందులో కూడా నీళ్లు ఉన్నట్లు తేలడంతో సిబ్బందితో ఘర్షణ పడ్డాడు. లీటర్ పెట్రల్ లో అర లీటర్ నీళ్లు కలుపుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. పెట్రోల్ లో నీళ్లు కలపడంతో ఇంజన్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పెట్రోల్ బంకుల మోసాలపై అధికారులు దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పెట్రోల్ బంకుల యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, పెట్రోల్ పంపుల యజమానులు మోసాలకు పాల్పడుతుండడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. గతంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలం పరిధిలో నల్ల చెరువుకట్ట సమీపంలో భారత్ పెట్రోల్ పంపులో ఓ వాహనదారుడు లీటర్ పెట్రోల్ బాటిల్‌లో కొట్టించడంతో పెట్రోల్ తక్కువ రావడంతో పెట్రోల్ బంకు యాజమాని మోసం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసింది.

## జపాన్‌లో కొత్త రికార్డు..
## లక్షకు చేరిన 100 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య

కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఆ దేశంలో వంద ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య లక్ష దాటినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వరుసగా 55వ సంవత్సరం ఆ దేశం కొత్త రికార్డును నమోదు చేసింది. సెప్టెంబర్‌లో శతాధిక వృద్ధుల సంఖ్య 99,763 మందికి చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి శుక్రవారం వెల్లడించారు. అయితే దీంట్లో 88 శాతం మంది మహిళలే ఉండడం గమనార్హం. అత్యధిక కాలం జీవిస్తున్న వారి సంఖ్య జపాన్‌లో అధికం. ఆ లిస్టులో జపాన్ టాప్‌లో ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత వృద్ధ వ్యక్తి ఆ దేశంలో జీవిస్తున్నట్లు రికార్డులు ఉన్నాయి. చాలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జపాన్ ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. కానీ అక్కడ జనన రేటు తక్కువగా ఉన్నది. జపాన్ నివేదికల ప్రకారం.. ఆదేశంలో జీవిస్తున్న అత్యంత వృద్ధ వ్యక్తి వయసు 114 ఏళ్లు. యమటోకరియామాకు చెందిన ఆ మహిళను షిగికో కగ్వాగా గుర్తించారు. నారా సిటీకి శివారు ప్రాంతంలో ఇది ఉన్నది. జపాన్ లెక్కల ప్రకారం అత్యంత వృద్ధ మగ వ్యక్తిని కియోటకా మిజునోగా గుర్తించారు. ఆయన వయసు 111 ఏళ్లు. ఇవాటా అతని స్వస్థలం. ఆరోగ్యశాఖ మంత్రి తకమారో పుఖోకా ఈ నేపథ్యంలో వృద్ధులకు కంగ్రాట్స్ చెప్పారు. 87,784 మంది మహిళలు, 11,979 మంది వృద్ధ పురుష జనాభా ఉన్నట్లు మంత్రి తెలిపారు. సమాజ అభివృద్ధికి సహకరించిన వారికి ధన్యవాదులు చెబుతున్నట్లు వెల్లడించారు. జపాన్‌లో సెప్టెంబర్ 15వ తేదీన వృద్ధ దినోత్సవం జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నుంచి ఆ వృద్ధులకు ఓ లేఖ, సిల్వర్ కప్ అందిస్తారు. ఈ ఏడాది 52,310 మంది పురస్కారానికి ఎంపికయ్యారు.






## మిరాయ్ సెన్సేషనల్ ఓపెనింగ్స్!

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ హీరోగా రితిక నాయక్ హీరోయిన్ గా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే “మిరాయ్”. తెలుగు సినిమా నుంచి మరో సాలిడ్ వర్క్ గా వచ్చిన ఈ సినిమా తేజ సజ్జ కెరీర్లో మరో భారీ ఓపెనింగ్స్ అందుకున్న సినిమాగా కనిపిస్తుంది. మరి యూఎస్ మార్కెట్ లో అయితే “మిరాయ్” భారీ ఓపెనింగ్స్ ని అందుకున్నట్టుగా తెలుస్తుంది. ప్రీమియర్స్ సహా డే 1 నాటికి సినిమా ఏకంగా 7 లక్షల డాలర్స్ ఓపెనింగ్స్ సాధించి దుమ్ము లేపింది. దీనితో మన మిడ్ రేంజ్ హీరోస్ లో తేజ సజ్జ ఒక సెన్సేషనల్ ఓపెనింగ్స్ ని అందుకున్నాడని చెప్పాలి. ఇక ఈ వీకెండ్ కి ఈ సినిమా ఈజీగా 1.5 మిలియన్ డాలర్స్ మార్క్ ని దాటేసినా ఎలాంటి ఆశ్చర్యం లేదని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి గౌర హరి సంగీతం అందించగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు అత్యున్నత ప్రమాణాలతో సినిమాని నిర్మాణం వహించారు.





## ‘మహావతార్ నరసింహ’ విధ్వంసం..
## 50 రోజులు రికార్డు థియేటర్స్ లో

ఇటీవల వచ్చి సెన్సేషనల్ హిట్ అయ్యిన చిత్రాల్లో ఒక యానిమేషన్ చిత్రం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఎలాంటివో స్టార్ తారాగణం లేకపోయినప్పటికీ ఏకంగా 300 కోట్లు కొల్లగొట్టిన ఆ చిత్రమే “మహావతార్ నరసింహ”. దర్శకుడు అశ్విన్ కుమార్ తెరకెక్కించిన ఈ డివోషనల్ డ్రామా చాలా కాలం తర్వాత ఒక భారీ లాంగ్ రన్ ని సొంతం చేసుకొని థియేటర్స్ లో దుమ్ము లేపింది. ఇలా మొత్తం 50 రోజులు రన్ ని పూర్తి చేసుకోగా ఎన్నో ఏళ్ళ నుంచి మిస్ అవుతున్న 50 రోజుల రన్ ని అది కూడా రికార్డు స్క్రీన్స్ లో పూర్తి చేసుకోవడం విశేషం. ఇలా మహావతార్ నరసింహ చిత్రం ఏకంగా 200 థియేటర్స్ లో పూర్తి చేసుకోవడం అనేది మామూలు విషయం కాదు. ఇప్పటికీ వీటిలో సినిమా స్ట్రాంగ్ రన్ తోనే దూసుకెళ్తుంది. ఇక ఈ చిత్రానికి సామ్ సి ఎస్ సంగీతం అందించగా క్లీం ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహించగా తెలుగులో గీతా ఆర్ట్స్ బ్యానర్ పై రిలీజ్ అయ్యింది.

## హాట్ హాట్ గా ఉన్న
## మీనాక్షి చౌదరి

మీనాక్షి చౌదరి ఇటీవలే కొన్ని హాట్ ఫోటోషూట్‌లు, గ్లామర్స్‌తో ఆకట్టుకునే అందమైన దుస్తులు ధరించి నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నారు. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు, దేవకన్యలా కనిపించిన తీరు, మెయిన్‌స్ట్రీమ్ టాలీవుడ్ హీరోయిన్‌లలో ఆమెను ఒక లక్కీ ఛార్మ్‌గా మార్చాయి. ఆమె ఇటీవల చేసిన ఫోటోషూట్‌లు దేవకన్య లుక్స్‌తో, హాట్నెస్ డోస్‌తో నెటిజన్లను మైమరపించాయి. ముఖ్యంగా ఆమె ఇన్స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేసిన ఫోటోలు బాగా వైరల్ అయ్యాయి. ఆమె హాట్నెస్ డోస్‌తో నెటిజన్లను మంత్రముగ్ధులను చేయడం ద్వారా ఆమె కమర్షియల్‌గా ముఖ్యమైన హీరోయిన్‌లలో ఒకటిగా నిలిచారు. మెర్మాయిడ్ ఎంబ్రాయిడరీ గౌన్లు, స్టైలిష్‌గా కనిపించే దుస్తులు ధరించి ఆమె సోషల్ మీడియాలో హడావిడి సృష్టిస్తున్నారు. తన నటనతో పాటు, అందమైన రూపంతో ప్రేక్షకుల మనసులను దోచుకుంటూ, అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.





## మూసీకి పెరిగిన వరద.. ముసారంబాగ్‌లో బ్రిడ్జి మూసివేత

ఇటీవల కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలు నిండు కుండలా మారాయి. దీంతో జలమండలి అధికారులు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి మూసీలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మూసీలో వరద ఉధృతి పెరగడంతో ముసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్తున్నది. దీంతో అధికారులు బ్రిడ్జిని మూసివేశారు. వంతెనకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. గత నెల రోజుల్లో ముసారంబాగ్ బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్లడం ఇది నాలుగోసారి. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా జూలూరు వద్ద లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరద పారుతున్నది. దీంతో జూలూరు-రుద్రవెల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు వాహనాలను అనుమతించడం లేదు.

## గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవినుండి తొలిగింపు



రాష్ట్రంలోని కీలకమైన గాంధీ ఆసుపత్రిలో పాలనాపరంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రాజకుమారిని ఆ పదవి నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో వైద్య విద్య అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వాణికి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది.గత కొంతకాలంగా డాక్టర్ రాజకుమారి పనితీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి. ఆసుపత్రి నిర్వహణ, పరిపాలన విషయాల్లో ఆమె వైఫల్యం చెందారంటూ పలువురు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, ఆమెపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఈ బదిలీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిపాలనను గాడిన పెట్టేందుకు రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలోనే ఈ మార్పు జరిగినట్లు స్పష్టమవుతోంది. డాక్టర్ వాణికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు.



## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కికి మోదీ అభినందనలు..

నేపాల్‌లో కల్లోల పరిస్థితులు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్నాయి. మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కార్కీ నేపాల్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా ద్వారా సుశీలా కార్కీకి అభినందనలు తెలియజేశారు.నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సుశీలా కార్కీకి అభినందనలు. పొరుగుదేశంలోని ప్రజల శాంతి, పురోగతికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

## యూరియా పై వైసీపీ కావాలనే దుష్ప్రచారం చేస్తుంది



రైతులకు అందించాల్సిన యూరియా బస్తాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను గాలికొదిలి, అవినీతికి పాల్పడుతోందని విమర్శలు చేస్తున్నారు. జగన్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశామని, ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని వారు ఆరోపిస్తున్నారు. వైసీపీ ఆరోపణలపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. యూరియాలో అవినీతి జరిగిందంటూ వైసీపీ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. యూరియాకు సంబంధించి రూ. 250 కోట్ల అవినీతి జరిగిందంటూ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. "రాష్ట్రంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా బస్తాపై ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయలేదు" అని మంత్రి స్పష్టం చేశారు.

## పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత భార్య



మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య పోతుల కల్పన అలియాస్ సుజాతక్క పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యురాలుగా సేవలందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇంచార్జీగా పని చేస్తున్నారు. గద్వాల ప్రాంతానికి చెందిన కల్పన ఏకైక మహిళా నాయకురాలుగా పని చేస్తున్నట్టు సమాచారం. కల్పన 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారని పోలీసులు వెల్లడించారు. శనివారం ఆమె లొంగుబాటు గురించి డిజిపి జితేందర్ వివరాలు వెల్లడిస్తారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోతున్నట్టు సమాచారం. ఆమెపై కోటి రూపాయాల రివార్డు కూడా ఉంది. పశ్చిమ బెంగాల్ లో 2011లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె భర్త కిషన్‌జీ మృతి చెందాడు.

## కూకట్‌పల్లి రేణు మర్డర్ కేసును
# మలుపు తిప్పిన క్యాబ్ డ్రైవర్..
## ఇద్దరు నిందితులు అరెస్ట్



కూకట్‌పల్లి రేణు అగర్వాల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులు ఇద్దరినీ రాంచీలో కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు ముందు మెదక్ తుప్రాన్‌లో ఒక ఫాం హౌస్ లో హర్ష గ్యాంగ్ పార్టీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో మొత్తం 9 మందిని గుర్తించిన పోలీసులు. ఇందులో నిఖిల్ అనే వ్యక్తిని ఢిల్లీ ఫరిధాబాద్ లో పోలీసులు పట్టుకున్నారు. ఇక క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు మొత్తం కేసును ఛేదించారు. హైదరాబాద్ లో కొండాపూర్ నుంచి రాంచీ క్యాబ్ బుక్ చేసుకున్న హర్ష.. సంఘటన జరిగిన రోజే బయల్దేరారు. రాంచీలో వాళ్ళను డ్రాప్ చేసి వస్తున్న సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చిన క్యాబ్ డ్రైవర్. క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే?

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సాన్వీ లేక్ అపార్ట్‌మెంట్‌లో 1311 ప్లాట్‌లో రాకేష్ అగర్వాల్, రేణు (50) దంపతులు నివాసం ఉంటున్నారు. రాకేష్‌కు సనత్‌నగర్‌లో స్టీల్ షాప్ ఉంది. వారి ఇంట్లో పది రోజుల క్రితం హర్ష అనే వ్యక్తి పనికి కుదిరాడు. ఎంతో నమ్మకస్తుడి మాదిరి యజమానులను నమ్మించిన హర్ష అదును కోసం ఎదురు చూశాడు. బుధవారం భర్త రాకేష్, కుమారుడు షాప్‌కు వెళ్లగా రేణు ఒక్కతే ఇంట్లో ఉంది. ఇక సాయంత్రం ఆమె భర్త ఇంటికి వచ్చి చూడగా ఇల్లు తాళం వేసి ఉండటం చూసి ఫోన్ చేశాడు. ఫోన్‌ను ఎవరూ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ప్లంబర్ సహాయంలో తలుపులు తెరిచి చూడగా.. రేణు రక్తం మడుగులో పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు రేణు కాళ్లు, చేతులు కట్టేసి కుక్కర్‌తో తలపై, కత్తితో 20 సార్లు పొడిచి హత్య చేసినట్లు గుర్తించారు. హర్షతోపాటు అదే అపార్ట్‌మెంట్‌లో బంధువుల ఇంట్లో పనికి కుదిరిన రోషన్ అనే వ్యక్తి.. వీరిద్దరూ కలిసి ఈ హత్యకు పాల్పడ్డారు. హత్య అనంతరం నిందితులు ఇద్దరూ రక్తంతో తడిసిన దుస్తులను అక్కడే వదిలేసి, స్నానం చేసి స్కూటీపై పరారైనట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డైంది. రేణు హత్య తర్వాత ఆమె ఒంటిపై 5 తులాల బంగారం, రూ.50 వేల నగదుతో నిందితులు పరారయ్యారు. హత్య సమయంలో రేణు కేకలు వేయకుండా ఉండేందుకు ఆమె గొంతులో కత్తెరతో పొడిచి ఆపై దారుణానికి పాల్పడ్డారు.

## భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు.. ఎనిమిది మంది మృతి

కర్ణాటక రాష్ట్రంలో విషాదం చోటు చేసుకుంది. హసన్ జిల్లాలోని ఓ గ్రామంలో గణేష్ నిమజ్జన ఊరేగింపుపై ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోసలే హోసహల్లి గ్రామంలో గణేష్ చతుర్థి వేడుకల చివరి రోజైన శుక్రవారం రాత్రి 8:45 గంటల సమయంలో గణేష్ నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ క్రమంలో అరకలగూడు నుంచి వస్తున్న ఓ ట్రక్కు అదుపుతప్పి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 20 మందికిపైగా గాయపడ్డారు. రంగంలోకి దిగిన అధికారులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.



## గ్లామర్ తార జాక్వెలిన్

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది.

## నేడు మణిపూర్ పర్యటనకు ప్రధాని మోదీ.. ఈశాన్య రాష్ట్రంలో భద్రత కట్టుదిట్టం

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేడు పర్యటించనున్నారు. జాతుల మధ్య హింస చెలరేగిన తర్వాత ప్రధాని ఆ రాష్ట్రంలో తొలిసారి పర్యటించబోతున్నారు. కాగా, కుకి, మైతీ వర్గాల మధ్య జాతి ఘర్షణలు తలెత్తిన విషయం తెలిసిందే. మే 2023లో ప్రారంభమైన ఈ హింసలో దాదాపు 260 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ఘర్షణల తర్వాత ఈశాన్య రాష్ట్రంలో ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన దృష్ట్యా మణిపూర్ ప్రభుత్వం భద్రత కట్టుదిట్టం చేసింది. మరోవైపు ప్రధానికి వెల్‌కమ్ చెబుతూ ఇంఫాల్ లో పోస్టర్లను ఏర్పాటు చేశారు. సమగ్ర, సుస్థిర, సమృద్ధికరమైన అభివృద్ధి సాధించే దిశగా ప్రధాని మోదీ పర్యటన సాగనున్నది. మణిపూర్‌లోని చురాచాంద్‌పుర్‌లో సుమారు రూ.7,300 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేయనున్నారు. మణిపూర్ అర్బన్ రోడ్స్, డ్రైనేజీ, అసెట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టు కోసం రూ.3,600 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రూ.2,500 ఖర్చుతో అయిదు జాతీయ రహదారులు నిర్మించనున్నారు. మణిపూర్ ఇన్‌ఫోటెక్ డెవలప్మెంట్ ప్రాజెక్టు, 9 ప్రదేశాల్లో వర్కింగ్ వుమెన్స్ హాస్టల్స్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించనున్నారు. ఇంఫాల్‌లో సుమారు రూ,1200 కోట్ల ఖర్చుతో చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించనున్నారు. మణిపూర్‌తో పాటు మిజోరం, అస్సాం, బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మోదీ పర్యటించనున్నారు.

